## మినీ కథావీధి

# అపార్థం

సిద్ధార్థ



"ఏయ్ రిక్షా! వస్తావా?" అంటూ పిలిచాడు ముకుందం దారిని పోతున్న ఓ ఖాళీ రిక్షాను.

ఆ రిక్షావాడు కళ్ళతోటే వస్తున్నానని పించి ముకుందం ముందుకువచ్చి ఆగాడు.

"జగడాలవారి వీధికి కొద్దిగా పైకి పోవాలి. యెంతిమ్మంటావ్?" అన్నాడు ముకుందం.

రిక్షావాడు గునుస్తూ "మీరిచ్చేదే ఇయ్యండి." అన్నాడు.

"లేదు సరిగ్గా చెప్పు." అన్నాడు పట్టుదలగా ముకుందం.

రిక్షావాడు ఇక తప్పదన్నట్లు "ముప్పావలా ఇవ్వండి." అన్నాడు.

ఒక్కసారి దీర్ఘమైన నిట్టూర్పును తృప్తిగా వదిలి సామ్రాజ్యం గెలిచిన మహారాజులా రిక్షా ఎక్కి కూర్చున్నాడు. రిక్షా మెల్లిగా ఏనుగు అంబారీలా నడుస్తోంది.

రిక్షాలోని ముకుందం ఆ రోడ్డు కిరుపక్కలా వున్న దుకాణాలను పరికిస్తూ అంతులేని గాలి సౌధాల ఊహాప్రపంచంలో ఊగిసలాడుతూ, మధ్యలో వచ్చే రిక్షా కుదుపులకు లయబద్ధంగా ఊగుతూ ఆలోచనావస్థలో ఉన్నాడు.

రిక్షావాడు బ్రతుకు భారం మోస్తున్నట్లుగా రిక్షా త్రొక్కుతూ "జోరుమీద పోతున్నది ఒంటెద్దు బండీ" అని రాగయుక్తంగా, రిక్షా బెల్లును తాళంగా మ్రోగిస్తూ పాడుతున్నాడు.

ఇంతలో ఒక లారీ ఎదురుగా దూసుకు వస్తోంది. దాని ముందరి భాగం నారింజ రంగులోను, వెనుకభాగం ఆకుపచ్చ రంగులోను హనుమంతుని తలను మరిపిస్తూ దూసుకువస్తోంది. దానిది ఏ డీసిలో, లేక కిరసనాయిలోగాని ఆ లారీ వెనుక నల్లటి పొగ హనుమంతుని తోకలా మెలికలు తిరుగుతూ వస్తోంది. ఆ లారీ ఆ విధంగానే వచ్చి ముకుందం కూర్చున్న రిక్షా ప్రక్కనుంచి దూసుకుపోయింది. అది వెళ్ళిపోగానే ఆ ప్రదేశమంతా అంతులేని పొగతో మూసుకుపోయింది. ఆ పొగతో ఎవరికీ కళ్ళు కనిపించకుండా పోయాయి.

ఇంతలో హఠాత్తుగా "ఢాం" అని ప్రేలింది. రిక్షావాడు రిక్షా దిగి వెనుక టైరులు పరికించసాగాడు.

ముకుందం ఆత్రంగా "ఏమిటీ?" అన్నాడు.

వాడు నిరాశగా "టైర్ పంక్చర్" అన్నాడు.

"అరె ఎలా తెలిసింది?" అన్నాడు ఆశ్చర్యంగా ముకుందం.

వాడు అంతకన్నా ఆశ్చర్యంగా చూసి "ఢాం అన్న శబ్దం వినిపించలేదండీ?" అన్నాడు.

ఒక్కసారిగా ముకుందం ముఖం ముకుళించుకుపోయింది. ఇందాక ఆ శబ్దం అతనికీ వినిపించింది. ఇక్కడ ఓ విషయం చెప్పాలి. ముకుందం చిన్నప్పటినుంచీ ఒక దురలవాటు చేసుకున్నాడు. అతనికి తుమ్ములు వచ్చినప్పుడు చుట్టుప్రక్కల ప్రదేశమంతా ఒక్కసారిగా మారుమ్రోగిపోవాలి. ఆ అలవాటే రిక్షాటైర్ పగిలిపోయినట్లు రిక్షా అతనిచేత అనిపించింది. ముకుందానికి సిగ్గు కలిగించిందీ!

---

# ఎక్సర్‌సైజ్



ఎ.బి. రాజేంద్రప్రసాద్ రెడ్డి

శ్రీవారి స్కూటర్ స్టార్టయ్యాక తలుపేసి లోపలికొచ్చింది. రేవతి ఉదయం పోసులో వచ్చిన ఉత్తరాలు డ్రెస్సింగ్ టేబిల్ మీదున్నాయి. ఉత్తరాలు వెతికి మొదట అరుణ దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని విప్పి చదివింది.

చాలా రోజులకి అరుణ దగ్గర్నుంచి ఉత్తరం చూట్టంతో రేవతి ఆలోచనలన్నీ గతంలోకి పరుగెట్టాయి. కాలేజిలో షటిల్ డబుల్స్‌లో తన పార్ట్‌నర్ అరుణ. రెండు సార్లు విన్నర్స్‌గా వచ్చారు. తన పెళ్ళయి సంవత్సరం కావస్తోంది. ఆ ఆటలూ, పాటలూ అన్నీ మర్చిపోవాల్సి వచ్చింది. శ్రీవారికి అన్నీ అమర్చి ఇంటి పనులు పూర్తయేసరికి వున్న టైం అయిపోతోంది. అందంగురించీ, శరీర సౌష్ఠవం గురించీ ఇదివరకు తను తీసుకునే జాగ్రత్తలూ, ఎక్సర్‌సైజులూ, డైటింగులూ అన్నీ మూలబడ్డాయి.

ఒక్కసారి అద్దంలో చూసుకుంది రేవతి. పెళ్ళయాక ఎంత మార్పు! ఇదివరకటికన్నా బాగా బొద్దుగా తయారయానని పించింది. నడుము సైజు మెల్లగా పెరిగిపోయింది. కొన్నాళ్ళకి తనిక డబ్‌లవ్‌లా తయారవుతుంది కామోసు. దిగులేసింది రేవతికి. అరుణ మాత్రం యూనివర్సిటీలో చేరి ఇంకా షటిల్ ఛాంపియన్‌గా కొనసాగుతూనే వుంది.

నిలువుటద్దంలో చూసుకుంటున్న రేవతి ఉలిక్కిపడింది. ఆ చిరుబొజ్జ తనదేనా? ఇదివరకిలాగే వున్న మేడమ్స్‌ని చూసి నవ్వుకునేది. ఇంకొన్నాళ్ళకి తనూ ఇంత పొట్టతో - మైగాడ్.... ఇకనైనా తన ఫిగర్‌ని కాపాడుకోవాలి. డైటింగ్, ఎక్సర్‌సైజులూ అన్నీ మొదలెట్టాలి.

అల్మైరాలో ఏనాడో పడేసిన జీన్స్ బయటకి తీసి వేసుకుంది రేవతి. పుల్లింగ్ స్ప్రింగులు తీసుకొని ఎక్సర్‌సైజులు చేయడం మొదలెట్టింది కొంతసేపు స్ప్రింగ్స్‌తో చేశాక ఆసనాలు, సిటప్స్ చేసింది. తృప్తి కలగలేదు. మళ్ళీ స్ప్రింగ్స్‌తో వ్యాయామం మొదలెటింది. మధ్య మధ్య తనబొజ్జ గుర్తుకువస్తోంటే మరింత పట్టుదలగా చేయనారంభించింది. కొంతసేపటికి అలసట అనిపించింది. అయినా ఆపలేదు. కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్ళు బైర్లు కమ్మాయి. రేవతి శరీరం స్వాధీనం తప్పింది. అంతా చీకటి.

* * *

రేవతి కళ్ళు తెరిచేసరికి మంచం పక్కనే అత్తగారూ, భర్తా ఉన్నారు. రేవతి కళ్ళు తెరవడంచూసి ఎదురుగాఉన్న డాక్టరు నవ్వుతూ అన్నాడు: "కంగ్రాచ్యులేషన్స్-మీరు తల్లి కాబోతున్నారు."